సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 7 । మార్చి । 2023



వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం జరిగిన ప్రమాదాల్లో ఐదుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు.

- 8లో



11టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడి చేసి పెద్దమొత్తంలో అక్రమంగా తరలిపోతున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు.

- 8లో



జేఎన్‌టీయూ జీవీలో టెక్నికల్ సింపోజియం

జేఎన్‌టీయూ జీవీలో 'మెకనో (ఎంఎంఎక్స్ఎక్స్-3)' పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించే 11వ జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం సోమవారం ప్రారంభమైంది.

- 8లో

న్యూస్‌రీల్

నేడు శంబర పోలమాంబ ఏడో జాతర



మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఏడవ జాతర మంగళవారం జరగనుంది. భక్తులకు అమ్మవారి దర్శన ఏర్పాట్లను ఈఓ వి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టారు. చదురుగుడి, వనంగుడి క్యూకాంప్లెక్స్‌ల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించారు. భక్తులకు పులిహోరా, లడ్డూప్రసాదం అందుబాటులో ఉంచారు. ఏడవ జాతరకు భక్తులు అధికసంఖ్యలో వచ్చే అవకాశమున్నందున సాలూరు సీఐ ధనుంజయరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం పట్టణాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడవనుంది.

రైతులకు వివాద రహిత భూమి



జె.గోపాలపురం గ్రామసభలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

వీరఘట్టం: రైతులకు వివాద రహిత భూమిని అప్పగించడమే రీ సర్వే లక్ష్యమని పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. చలివేంద్రి పంచాయతీ పరిధిలోని జె.గోపాలపురం గ్రామంలో రీ సర్వేపై నిర్వహించిన గ్రామసభలో ఆయన రైతులతో మాట్లాడారు. గ్రామంలో ఉన్న 382 ఎకరాలు భూమిని సర్వేచేసి అప్పగించామన్నారు. రీ సర్వేపై అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. ఏవైనా పేర్లు తప్పు పడినా, భూవివరాలు ఎక్కువ, తక్కువగా నమోదైనా వెంటనే తెలియజేస్తే తమ సిబ్బంది సరిచేస్తారని సూచించారు. గ్రామ సభలో తహసీల్దార్ చందక సత్యనారాయణ, వీఆర్వో పొన్నాడ రఘునాయుడు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరావు

పార్వతీపురం: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ సమావేశమందిరంలో డీఆర్వో జల్లేపల్లి వెంకటరావు అధికారులతో సమీక్షించారు. ఎన్నికల సామగ్రి పంపిణీని సాఫీగా చేపట్టాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ వద్ద ఎన్నికలసామగ్రి పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన పద్ధతులపై దిశానిర్దేశం చేశారు. బ్యాలెట్ పేపర్ల పంపిణీ, పరిశీలన, బండ్లింగ్ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి ఉమామహేశ్వరరావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసనతీరు పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ ఎస్‌డీవీ రమణ

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలంలోని డోకిశీల, తాళ్లబురిడి ఉన్నత పాఠశాలలను డీఈఓ ఎస్‌డీవీ రమణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదోతరగతి విద్యార్థుల అభ్యసన తీరును పరిశీలించారు. ప్రతీ పాఠ్యాంశంపైనా అవగాహన పెంపొందించుకోవాలని, సందేహాలను ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో చొక్కాపు శ్రీనివాసరావు, హరిప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు



సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

మెంటాడ: మండల కేంద్రంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సామూహిక కుంకుమ పూజలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పీసీపాటి శ్రీనివాసశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు మాచర్ల అప్పారావు, ముప్పిడి నగేష్, కొల్లా భరత్ తదితరులు పూజా ఏర్పాట్లు చేశారు.

కొండజక్కరతో సాగు భళా..!

- ఊటనీరే పంటలకు ఆధారం
- రెండున్నర ఎకరాల్లో 35 రకాల పంటల సాగు
- ఏటా రూ.2లక్షలు దాటి ఆదాయార్జన
- పెట్టుబడి ఖర్చులకు వైఎస్సార్ రైతు భరోసా డబ్బులు
- ఆదర్శంగా నిలుస్తున్న గిరిజన రైతు

ఆయనో గిరిజన రైతు. కొండపోడే జీవనాధారం. వర్షాలు కురిసే వేళ కొండ ఊటను ఒడిసి పడుతున్నాడు. కొండపై రాళ్ల గుంటలో నిల్వ చేస్తున్నాడు. ఆ నీటితో తనకున్న రెండున్నర ఎకరాల భూమిలో ఎనిమిదేళ్లుగా 35 రకాల పంటలు సాగుచేస్తున్నాడు. ఏటా రూ.2లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నాడు. గిరిజన రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. గిరిజన రైతు సాగుపథాన్ని ఓ సారి పరికిస్తే...



తన పంటపొలంలో కోసిన ఎర్ర అరటి పండ్ల గెలతో గిరిజన రైతు

కురుపాం:

కురుపాం మండలానికి కూతవేటు దూరంలో జియ్యమ్మవలస మండలం అలమండ పంచాయతీ నిడగల్లుగూడ గిరిజన గ్రామానికి చెందిన బిడ్డిక కించయ్య ఓ గిరిజన రైతు. ఆయనకు కొండపోడులో సుమారు రెండున్నర ఎకరాల భూమి ఉంది. వ్యవసాయమే జీవనాధారం. వర్షపునీరే సాగునీటికి ఆధారం. ఏడాది పొడవునా పంటలు సాగుచేయాలంటే సాగునీటిని ఒడిసిపట్టాల్సిన అవసరాన్ని గుర్తించాడు. గిరిశిఖర గ్రామాలైన పీటి మండ, టి.కె.జమ్ము, డ్రాక్షిణి, చిన్నదోడ్డ, కొండనిడగల్లు తదితర గ్రామాల నుంచి పెద్దగెడ్డ ద్వారా జాలువారే ఊటనీరు, వర్షపు నీరు నిల్వఉండేలా తన భూమికి ఎగువన ఓ పెద్ద గుంట తవ్వాడు. వర్షపునీరు, కొండజక్కరను అందులో నిల్వ చేస్తూ బోదె ద్వారా పంటకు కావాల్సిన సాగునీటిని అందిస్తున్నాడు. ఇలా ఎనిమిదేళ్లుగా భార్య పార్వమ్మతో కలిసి కొండపోడులో బంగారు పంటలు పండిస్తున్నాడు. ఆర్థికంగా ఎదుగుతున్నాడు.



ఊట నీటిని పంటకు విడిచిపెడుతున్న గిరిజన రైతు బిడ్డిక కించయ్య



సేంద్రియ పద్ధతిలో పండించిన టమోట పంటను చూపుతున్న గిరిజన రైతు కించయ్య, భార్య పారమ్మ

నిత్యం ఆదాయం వచ్చేలా..

గిరిజన రైతు కించయ్యకు నిడగల్లుగూడ సమీపంలో ఉన్న మెట్ట, పల్లం భూమిలో జీడి, మామిడి, అరటి, ఎర్ర అరటి, దానిమ్మ, జామ, బొప్పాయి, మునగ, కూర అరటి, జునుములు, చెరకు, పందిరిదొండ, చిక్కుడు, నిమ్మ, పొట్టి చిక్కుడు, కాలీఫ్లవర్, ముల్లంగి, కాకర, కంది, అల్లం, పసుపు, వంకాయ, జొన్న, సీతాఫలం, అంగాకర, వరి, ఆకు కూరలను సాగు చేస్తున్నాడు. నిరంతరం ఆదాయం వచ్చేలా ప్రణాళి కా బద్ధంగా ముందుకు 'సాగు'తున్నాడు. చేతికి అందిన పంటలను గిరిజన గ్రామాలు, వారపు సంతల కు తరలించి విక్రయిస్తున్నాడు. సేంద్రియ ఎరువుల తో సాగుచేసిన పంటలకు గిరాకీ ఉందని, ఏడాదికి రెండు లక్షల రూపాయలు దాటి ఆదాయం ఆర్జిస్తున్నట్టు వివరించాడు. గత ప్రభుత్వాలు తనకు ఆదుకోక పోయినా ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూడేళ్లుగా రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందిస్తోందని సంతోషం వ్యక్తంచేశాడు.

సాగునీటిని నిల్వ చేసి..

పంటలు సాగుచేయాలంటే సాగునీరు అవసరం. వర్షాకాలంలో సమృద్ధిగా లభించే సాగునీరు వేసవిలో ఉండదు. అందుకే కొండపై వర్షపునీరు, కొండజక్కరను నిల్వ చేస్తున్నాను. పంటకు కావాల్సినప్పుడల్లా విడిచిపెడుతున్నాను. దీనివల్ల ఏడాది పొడవునా పనిదొరుకుతోంది. పంటలు చేతికందుతున్నాయి. అధికారులు స్పందించి ఒక వ్యవసాయ బోరును మంజూరు చేస్తే సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

– బిడ్డిక కించయ్య, గిరిజన రైతు, నిడగల్లుగూడ



కాపుదశలో వంగచేను

భామినిలో సాయుధ బలగాలు



భామిని మండల కేంద్రంలో సాయుధ బలగాల పహారా

భామిని: భామిని మండల కేంద్రంలో సోమవారం సాయుధ పోలీస్ బలగాలు పహారా కాశాయి. బత్తిలి పోలీస్ స్టేషన్‌కు విశాఖ డీఐజీ జె.హరికృష్ణ సందర్శించనున్నారన్న సమాచారంతో ప్రత్యేక దళాలు ఆ ప్రాంతాన్ని జల్లెడపట్టాయి. డీఐజీ పర్యటన అకస్మికంగా వాయిదా పడడంతో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు బత్తిలి స్టేషన్ నుంచి వెళ్లిపోయారు. ఆ వెంటనే ప్రత్యేక దళాలు కూడా కూంబింగ్‌ను నిలిపివేశాయి.

లఖనాపురం వైపు ఏనుగులు



లఖనాపురం వైపు వెళ్లిన ఏనుగుల గుంపు

వీరఘట్టం: గత కొద్ది రోజులుగా నడుకూరు, కిమ్మి, చిట్టపులివలస గ్రామాల ప్రజలకు భయాందోళన కలిగించిన ఏనుగుల గుంపు ఎట్టకేలకు సోమవారం తెల్లవారుజామున ఈ ప్రాంతం నుంచి గరుగుబిల్లి మండలంలోని లఖనాపురం వైపు వెళ్లినట్లు డీఆర్వో రవిబాబు తెలిపారు. ఏనుగులు వెళ్లిపోవడంతో స్థానికులు హమ్మయ్యా...అంటూ ఊపిరిపీల్చుకున్నారు. ఇంతవరకు ఏనుగులు నాశనం చేసిన పంటలు, వ్యవసాయ పంపుసెట్లను అటవీశాఖ అధికారులు పరిశీలించి, ఆదుకోవాలని రైతులు కోరారు.

కిడ్నీవ్యాధి వ్యాప్తికి కారణాలు కనుక్కోండి

సీతానగరం: మండలంలోని నిడగల్లులో కిడ్నీవ్యాధి కేసులు నమోదుకు గల కారణాలను కనుక్కోవాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కళాశాల ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను కోరారు. సీతానగరం మండలం పెదంకలం పీహెచ్‌సీ పరిధిలోని నిడగల్లు ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన కిడ్నీ స్క్రీనింగ్ మెడికల్ క్యాంప్‌ను ఆయన సందర్శించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు, వ్యాధి అనుమానితులతో మాట్లాడారు. స్క్రీనింగ్ పరీక్షల నివేదికను అందజేయాలని డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావును ఆదేశించారు. కార్యక్రమంలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ సభ్యులు నెఫ్రాలజిస్ట్ డా.రత్నప్రభ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ పి.వి జయకుమార్, మైక్రో బయాలసిస్టు ఎమ్.మంజుల, సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్ ఎమ్.కల్యాణి, ఆర్‌బీఎస్ ప్రాజెక్టు అధికారి డా.ధవళ భాస్కర్‌రావు, ఎస్.ఎస్.ప్రసాద్ పట్నాయక్, డాక్టర్ రాధాకాంత్, సీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



వైద్య నిపుణుల బృందంతో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

దేవాలయాల అభివృద్ధికి టీటీడీ నిధులు



ఎమ్మెల్యే కళావతితో చర్చిస్తున్న దేవదాయశాఖ కమిషనర్ సుధారాణి

- జిల్లాలో 100 దేవాలయాల అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్
- పాలకొండ నియోజకవర్గంలోనే 98 దేవాలయాలు ఎంపిక
- ఒక్కో దేవాలయానికి రూ.10 లక్షల చొప్పున నిధులు విడుదల
- ఎమ్మెల్యే కళావతితో చర్చించిన జిల్లా దేవదాయశాఖ కమిషనర్ కె.ఎల్.సుధారాణి
- వచ్చేనెల నుంచి దేవాలయాల నిర్మాణాలకు శ్రీకారం

వీరఘట్టం: హిందూ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, తిరుమలతిరుపతి దేవస్థానం పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తోందని పార్వతీపురం మన్యం జిల్లా దేవదాయశాఖ కమిషనర్ కె.ఎల్.సుధారాణి తెలిపారు. జిల్లాలో 100 దేవాలయాల అభివృద్ధికి టీటీడీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా వీటిలో 98 దేవాలయాలు పాలకొండ నియోజకవర్గంలోనే ఉన్నాయన్నారు. ఒక్కో దేవాలయానికి రూ.10 లక్షల చొప్పున రూ.10 కోట్ల నిధులను టీటీడీ విడుదల చేసిందన్నారు. పాలకొండ నియోజకవర్గానికి మంజూరైన దేవాలయాల నిర్మాణాలపై దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతితో వండవ క్యాంపు కార్యాలయంలో సోమవారం సుధారాణి చర్చించారు. వచ్చేనెల నుంచి దేవాలయాల నిర్మాణాలకు శ్రీకారం చుడతామని ఎమ్మెల్యే కళావతికి సూచించారు. పాలకొండ నియోజకవర్గంలో 136 దేవాలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించగా 98 దేవాలయాల అభివృద్ధి టీటీడీ ముందుకు వచ్చిందన్నారు. దీనివెనుక ఎమ్మెల్యే కళావతి కృషిని ఆమె అభినందించారు. మంజూరైన నిధులతో రూ.2 లక్షలతో విగ్రహాలు, మిగిలిన సొమ్ముతో దేవాలయం అభివృద్ధి పనులు చేస్తామని దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్‌వీ రమణ తెలిపారు. ఏయే గ్రామాల్లో దేవాలయాలు అభివృద్ధి చేయాలనుకుంటున్నారో అక్కడ దేవాలయ కమిటీలు బ్యాంకు ఖాతాలు తెరవాలన్నారు.

తప్పుడు ప్రచారాలు మానుకోవాలి....

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ ఎమ్మెల్యేల ప్రతిపాదనలు మేరకు దేవాలయాల అభివృద్ధికి టీటీడీ నిధులు మంజూరు చేస్తుంటే కొందరు దళారులు దేవాలయాలపై తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అటువంటి వారి మాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే కళావతి ప్రజలకు సూచించారు. ఆలయాల అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని కోరారు. వారి వెంట వండవ గ్రామ సర్పంచ్ మిడితాన కళ్యాణి ఉన్నారు.

సైక్లింగ్‌తో మెరుగైన ఆరోగ్యం

పార్వతీపురం టౌన్:

వాకింగ్, సైక్లింగ్‌తో ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ సూచించారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని పార్వతీపురం ఆర్‌సీఎం స్కూల్ వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సైక్లింగ్ మారథాన్ ర్యాలీను సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ఆర్‌సీఎం స్కూల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉరుకులు, పరుగుల జీవితంలో ఆరోగ్యం మెరుగుపడేందుకు వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలన్నారు. సైక్లింగ్‌తో రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగు పడుతుందన్నారు. ప్రతీఒక్కరు చక్కని ఆహారపు అలవాట్లతో కూడిన జీవనవిధానం అలవర్చుకోవాలని సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.బగాది జగన్నాథరావు మాట్లాడుతూ హెల్త్ ఇండియాలో భాగంగా సైక్లింగ్ అనేది ఏరోబిక్ వ్యాయామని, శారీరక శ్రమ వలన హైపర్ టెన్షన్, మధుమేహం, కేన్సర్, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక జబ్బులకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డా.బి.వాగ్దేవి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌డీవీ రమణ, డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ కేతిరెడ్డి విజయలక్ష్మి, వైద్యులు, రెడ్ క్రాస్ చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్


11,833 మెట్రిక్ టన్నుల చెరకు తరలింపు

జామి: భీమసింగి విజయరామ గజపతి కోఆపరేటివ్ సుగర్స్ లిమిటెడ్ పరిధిలో 2022-23 సీజన్‌లో సాగుచేసిన 11,833 టన్నుల చెరకును సంకిలి ఈఐడీ సుగర్ ఫ్యాక్టరీకి తరలించినట్టు భీమసింగి సుగర్స్ ఎమ్‌డీ కె.ఆర్.విక్టర్ రాజు సోమవారం తెలిపారు. ఫ్యాక్టరీ పరిధిలో ఎవరి వద్ద అయినా చెరకు నిల్వలు ఉంటే యాజమాన్యంతో సంప్రదించాలన్నారు. ఫిబ్రవరి 25 వరకు సరఫరా చేసిన 11,650 మెట్రిక్ టన్నుల చెరకు డబ్బులు రూ.312 లక్షలను రైతుల ఖాతాలకు జమచేసినట్టు వెల్లడించారు. మిగిలిన మొత్తం కూడా త్వరలో జమచేస్తారని చెప్పారు.

7న పారిశ్రామిక వర్క్‌షాప్

విజయనగరం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7న జిల్లా కేంద్రంలోని ఆనందగజపతి ఆడిటోరియంలో ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలతో వర్క్‌షాప్ జరగనుందని ఎంఎస్ఎంఈ డీఎఫ్ఓ చంద్రమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ, విశాఖపట్నం డీఆర్‌డీఏ, జిల్లా పరిశ్రమలశాఖ, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్‌అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ జరుగుతుందన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను వివరిస్తామన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌జడ్జి యజ్ఞనారాయణ

పార్వతీపురంటౌన్: మహిళలకు చట్టాలపై అవగాహన తప్పనిసరని సబ్‌జడ్జి యజ్ఞనారాయణ అన్నారు. పార్వతీపురం పట్టణం బంగారమ్మ కాలనీలో సోమవారం న్యాయఅవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. చక్కగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. పేదలకు, గిరిజనులకు, దళితులకు, పేద దివ్యాంగులకు ఉచిత న్యాయ సేవలను అందిస్తున్నామన్నారు. వార్షిక ఆదాయం రూ. 3లక్షలలోపు ఉన్నవారంతా ఉచిత న్యాయసహాయం పొందవచ్చని తెలిపారు. గృహహింస, వరకట్న వేధింపులు, భ్రూణ హత్యల నియంత్రణకు పోలీస్‌శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు టి.జోగారావు, వెంకటరావు పాల్గొన్నారు.

803 మందికి రెండేసి రేషన్ కార్డులు

బొబ్బిలి రూరల్: ఆధార్ అనుసంధానంతో ఒక్కో కుటుంబానికి ఉన్న రెండేసి రేషన్‌కార్డుల విషయం వెలుగుచూసింది. బొబ్బిలి మండలం, పట్టణంలో 421 మందికి రెండేసి రేషన్ కార్డులు ఉన్నట్టు గుర్తించగా, రామభద్రపురం మండలంలో 133, తెర్లాం మండలంలో 66, బాడంగి మండలంలో 183 మందికి రెండేసి కార్డులు ఉన్నట్టు గుర్తించామని సీఎస్‌డీటీ రెడ్డి సాయికృష్ణ తెలిపారు. బొబ్బిలి మండలంలోని లబ్ధిదారులకు ఒడిశా, తెలంగాణాలలో కార్డులు ఉండగా, వారికి ఇక్కడకూడా కార్డులు ఉన్నాయన్నారు. రేషన్ లబ్ధిదారులను ఏకార్డులో ఉంటారో ఆప్షన్ అడిగి రెండో కార్డును తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

పెంకుటిల్లు దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది, గ్రామస్తులు

సీతానగరం: మండలకేంద్రంలోని సుంకరివీధిలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పెంకుటిల్లు దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సేపేన సింహాచలం(బ్రహ్మన్న) ఇంట్లో దేవుడికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి ఇంటితాళం వేసుకుని పొలం పనులకు బయటకు వెళ్లారు. 11 గంటలసయంలో పెంకుటిల్లు పెంకుల్లోంచి మంటలు రావడాన్ని స్థానికులు గుర్తించారు. వీధిలో ఉన్న వారంతా నీళ్లతో మంటలు ఆర్పడానికి ప్రయత్నం చేయడంతో అదుపులోకి వచ్చాయి. అప్పటికే ఇంటిపై కప్పుకలప కాలిపోవడంతో పాటు కొంత మేర సామగ్రి కాలిపోయింది. సమాచారం మేరకు బొబ్బిలి అగ్ని మాపక శకటంతో వచ్చిన సిబ్బంది పూర్తి స్థాయిలో మంటలను అదుపు చేశారు. మంటలు రేగుతున్న సమయానికే తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎస్సై కె.నీలకంఠం. సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేయడానికి ,ఇంట్లో ఉన్న సామగ్రి బయటకు తీయడానికి సహకారం అందించారు.

ఉద్యోగాల పేరిట మోసం చేసిన వ్యక్తులపై కేసు

విజయనగరం క్రైమ్: ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ ఎస్సై భాస్కరరావు సోమవారం తెలిపారు. ఈ మేరకు ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరంలోని సున్నంబట్టీవీధికి చెందిన చిప్పాడ సంతోష్ కుమార్..డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్ నోటిఫికేషన్‌కి సంబంధించి దరఖాస్తు చేసుకున్నాడు ఆ నోటిఫికేషన్‌కు సంబంధించి ఉద్యోగమిప్పిస్తానని, తమకు అధికారులందరూ బాగా తెలుసునంటూ శివ, అనిల్ అనే ఇద్దరు వ్యక్తులు సంతోష్‌కుమార్‌కు నమ్మించి గత ఏడాది ఆగస్టు నెలలో రూ 2 లక్షలు తీసుకున్నారు. అలాగే సంతోష్ కుమార్ ఇద్దరు స్నేహితుల దగ్గ చెరో రూ. 2 లక్షలు మొత్తం ముగ్గురి దగ్గర రూ.6 లక్షలు తీసుకున్నట్లు బాధితులు ఫిర్యాదుచేశారు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై భాస్కరరావు తెలిపారు.

నోటిఫికేషనే తరువాయి..

- సింగవరం ఎంపీటీసీ స్థానానికి తుది ఓటర్ల జాబితా సిద్ధం
- డి. తాళ్లవలస వార్డుమెంబర్ ఎన్నిక కూడా..


సింగవరం సచివాలయం

డెంకాడ: మండలంలోని సింగవరం ఎంపీటీసీ స్థానంతో పాటు డి.తాళ్లవలస ఏడో వార్డు మెంబర్‌కు సంబంధించిన ఓటర్ల తుది జాబితాలను అధికారులు సిద్ధం చేశారు. 01.01.2023 అర్హత తేదీగా ఓటర్ల జాబితాలను అధికారులు ఆయా కార్యాలయాల్లో వేలాడదీశారు. దీంతో ఎన్నికలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వడమే తరువాయి అధికారులు ఎన్నికలు నిర్వహిస్తారు. కొద్దిరోజుల కిందట సింగవరం ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు పిట్టా పద్మావతి పోటీ చేసి రెండు ఎన్నికల్లోనూ విజయం సాధించారు. దీంతో సర్పంచ్‌గా ఉంటూ ఎంపీటీసీ స్థానానికి పద్మావతి రాజీనామా చేశారు. దీంతో ఎంపీటీసీ స్థానానికి ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. అలాగే డి.తాళ్లవలస ఏడో వార్డు మెంబర్ తోరోతు సీతమ్మ మరణించింది. దీంతో ఈ వార్డు మెంబర్ స్థానం ఖాళీ కావడంతో ఇక్కడ కూడా ఎన్నిక అనివార్యమైంది.

మహిళా ఓటర్లే కీలకం..

సింగవరం పంచాయతీ పరధిలో సింగవరంతో పాటు నాతవలస పంచాయతీలున్నాయి. సింగవరం పంచాయతీలో 1450 ఓటర్లు ఉండగా అందులో పురుష ఓటర్లు 695 మంది కాగా మహిళా ఓటర్లు 755 మంది ఉన్నారు. నాతవలస పంచాయతీలో 1103 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు 547 మంది కాగా 556 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. సింగవరం ఎంపీటీసీ పరిధిలో పురుష ఓటర్ల కంటే 69 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. డి.తాళ్లవలస ఏడో వార్డు పరిధిలో 134 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 72 మంది పురుష ఓటర్లు కాగా 62 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

- డీపీఎం ఆనందరావు

డెంకాడ: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని డీపీఎం ఆనందరావు అన్నారు. మండలంలోని అమకాంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో విత్తన గుళికలను తయారు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ విత్తనాలు భూమిలో వేస్తే వర్షం వచ్చేవరకు విత్తనం పాడవదన్నారు. అలాగే చీడపీడలు కూడా ఆశించవని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకురాలు వనజ, ఎన్ఎఫ్ఏ మెర్సీ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం జరిగిన ప్రమాదాల్లో ఐదుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఆయా ప్రమాద సంఘటనలపై మృతుల బంధువులు, పోలీసులు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి.


విజయనగరం క్రైమ్: మిశ్రా మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

విజయనగరం క్రైమ్: బెంగళూరు టు హౌరా ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో మిశ్రా (45) అనే వ్యక్తి స్నేహితుడు బునియాతో కలిసి ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో ఎగ్జిట్ డోర్ వద్ద స్నేహితులు కూర్చుని మాట్లాడుకుంటూ నిద్రలోకి జారుకున్నారు. రైలు విజయనగరం దాటి గాజులరేగ బ్రిడ్జివద్దకు వచ్చేసరికి నిద్ర మత్తులో ఉన్న వారు కిందకు జారిపడిపోయారు. ఈ సంఘటనలో మిశ్రా అక్కడికక్కడే మృతిచెందగా బునియా తీవ్రగాయలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు వెంటనే స్పందించి గాయాలపాలైన వ్యక్తిని కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

రైలు నుంచి జారిపడి మరో వ్యక్తి..

గొట్లాం–గరుడబిల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు నుంచి జారిపడి విజయనగరానికి చెందిన పసుమర్తి మురళీకృష్ణ (31) మృతిచెందాడు. ఈ సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుని జేబులో ఉన్న ఆధార్ కార్డ్ పరిశీలించి మృతుడిని గుర్తించారు. దీంతో వారి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. మురళీకృష్ణ మినుమలు, పెసలు కొనుగోలు చేసి గ్రామాల్లో వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపారం నిమిత్తం ఆదివారం బొబ్బిలి వెళ్లి, సోమవారం తిరిగి రైల్లో వస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందాడు.


విజయనగరం క్రైమ్: నరహరి మృతదేహం

భవనంపై నుంచి జారిపడి వలస కార్మికుడు..

విజయనగరం మండల పరిధిలోని గుంకలాం కాలనీలో భవనంపై నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి జిల్లాకు చెందిన జి.నరహరి (42) వలస కార్మికుడు. గుంకలాంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి మేడపై పడుకున్న నరహరి నిద్రమత్తులో ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందాడు.

బొకారో ఎక్స్‌ప్రెస్ ఢీకొని మహిళ..

సీతానగరం: విశాఖ–రాయిపూర్ రైల్వే లైన్‌లో పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలంలోని రామవరం–కాశీపేట గ్రామాల మధ్య బొకారో ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో ఓ మహిళ (55) అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయమై బొకారో ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ విజయనగరం జీఆర్పీ సేషన్‌కు సమాచారం అందించిన వివరాలిలా ఉన్నాయి. చామనఛాయరంగులో ఉన్న మృతురాలి శరీరంపై నాచురంగు షర్టు, నల్లనిరంగు ప్యాంట్ ఉన్నాయి. ఎడమ చేతిపై అనిత అనే పచ్చబొట్టు హిందీ భాషలో ఉంది. మెడలో తాయెత్తు, కుడి భుజంపై ఓం, ఛాతీపైన సాధి అనిల్‌కుమార్ పండా అని పచ్చబొట్లు ఉన్నాయి. మృతురాలి వివరాలు తెలిసిన వారు ఫోన్ 7013770936, 9441013330 నంబర్లను సంప్రదించవచ్చని రైల్వే పోలీసులు తెలియజేశారు.


మెరకముడిదాం: మృతి చెందిన మండల గౌరినాయుడు

ఆటో, ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి..

మెరకముడిదాం: మండలంలోని ఊటపల్లి నుంచి మెరకముడిదాం వెళ్తున్న ఆటోను మెరకముడిదాం నుంచి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఊటపల్లి గ్రామానికి చెందిన మండలగౌరినాయుడు (55) ఆటోలోనుంచి కిదపడిపోవడంతో గాయాల పాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గౌరినాయుడు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

నేరాల నియంత్రణకు కృషి చేయండి

- ఎస్ఈబీ ఏఎస్పీ ఆస్మాఫర్హీన్

బొబ్బిలి రూరల్: నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్ఈబీ ఏఎస్పీ ఆస్మాఫర్హీన్ సూచించారు. సోమవారం స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌ను సందర్శించిన ఆమె తొలుత అక్కడి రికార్డులు, పెండింగ్‌లో ఉన్న కేసులను పరిశీలించారు. అనంతరం సిబ్బంది, మహిళా పోలీసులతో సమావేశమైన ఆమె సారా తయారీ, మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక బృందాలు ఏర్పడి, ఆకస్మిక దాడులు నిర్వహించాలన్నారు. సిబ్బంది పనితీరు, నేరాల నియంత్రణకు వారు తీసుకుంటున్న చర్యలపై ఏఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట సీఐ ఆర్.జైభీమ్, ఎస్ఐ చిన్నంనాయుడు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఈబీ ఏఎస్పీ ఆస్మా ఫర్హీన్

బాల్య వివాహం నిలిపివేత


అబ్బాయి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు ఎంపీటీసీ, సర్పంచ్ తదితరులు

వేపాడ: మండలంలోని ఆకులసీతంపేటలో ఈనెల 8వ తేదీన జరగాల్సిన బాల్య వివాహాన్ని వియ్యంపేట ఐసీడీఎస్ అధికారులు నిలిపేవేశారు. వివరాలిలా ఉన్నాయి. ఆకులసీతంపేటలో 15 ఏళ్ల అమ్మాయితో అదే గ్రామానికి చెందిన అబ్బాయితో నిశ్చయమైన వివాహం 8న జరగనున్నట్లు సమాచారం అందడంతో అధికారులు సోమవారం గ్రామానికి చేరుకున్నారు. పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణంరాజు, ఎంపీడీఓ పట్నాయక్, ఎస్సై రాజేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కామేశ్వరి, సర్పంచ్ సుంకరి రమణమ్మ, వైఎస్ఎంపీపీ అడపా ఈశ్వరావు, మహిళా పోలీసులు, ఆశ వర్కర్ల సమక్షంలో అబ్బాయి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అమ్మాయికి 18 ఏళ్లు వచ్చేవరకు వివాహం చేయకూడదని, ఒకవేళ చేస్తే చట్టరీత్యా నేరమని వివరించారు. దీంతో సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామపెద్దలు, అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది సమక్షంలో వివాహం నిలిపివేస్తామని అబ్బాయి తల్లిదండ్రులు అంగీకరించడంతో వారితో అధికారులు అంగీకార పత్రం రాయించారు.

జేఎన్‌టీయూ జీవీలో టెక్నికల్ సింపోజియం

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం 'మెకనో (ఎంఎంఎక్స్ఎక్స్–3)' పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించిన 11వ జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం సోమవారం ప్రారంభమైంది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఐఈ) సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శారద మెటల్స్ అండ్ ఎల్లాయిస్ సీనియర్ జనరల్‌మేనేజర్ ఎం.అనంత్‌కుమార్, సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ కె.మురళీకృష్ణ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమలలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరికరాలు, అవి పనిచేస్తున్న తీరు వంటి అంశాలపై పరిజ్ఞానాన్ని పెంచడానికి ఇలాంటి సదస్సులు దోహదపడతాయన్నారు.



సావనీర్‌ను విడుదల చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీకుమార్

అనంతరం సావనీర్‌ను విడుదల చేశారు. మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ సి.నీలిమాదేవి అధ్యక్షతన జరిగిన తొలిరోజు సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీకుమార్, ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్లు వి.మణికుమార్, డాక్టర్ కె.శ్రీనివాస్ ప్రసాద్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్పీ అక్రమాలపై విచారణ

రాజాం సిటీ: రాజాం మున్సిపాల్టీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన డ్వాక్రా గ్రూపు సభ్యులను అధికారులు సోమవారం విచారణ చేశారు. ఈ విచారణపై మెప్మా టీఎంసీ ఎస్వీ రత్నం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గ్రామానికి చెందిన ఇందిర ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులను అధికారులు శ్రీనివాసరావు, కృష్ణ, కిశోర్‌బాబులు విచారణ చేశారు. గతంలో గ్రామానికి చెందిన ఆర్పీ అవినీతి అక్రమాలకు పాల్పడిన విషయం విదితమే. ఇందుకు సంబంధించి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలోని సభ్యులను విచారణ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అప్పట్లో సభ్యులు విచారణకు సహకరించలేదు. మళ్లీ ఒక్కో గ్రూపును విచారణ చేసేందుకు అధికారులు నిర్ణయించి సోమవారం ఇందిరా గ్రూపు సభ్యులను విచారణ చేయగా రూ.5.40 లక్షల రుణం సీసీఎల్ (క్యాష్ క్రెడిట్ లోన్) మోడ్‌లో వాడుకున్నట్లు తేలింది.


గ్రూపు సభ్యులను విచారణ చేస్తున్న అధికారులు

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

11టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

- నిందితులపై కేసుల నమోదు

బాడంగి: విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడి చేసి పెద్దమొత్తంలో అక్రమంగా తరలిపోతున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు.వారికి అందిన సమాచారంతో ఉదయం 6 గంటలకే మండలంలోని ఆకులకట్ట జంక్షన్ మాటువేశారు. 11గంటల సమయంలో నాలుగు టాటాఏస్ వ్యాన్లలో సుమారు 11.635 టన్నుల బియ్యం తరలిపోతుండగా అడ్డుకుని స్వాధీనం చేసుకున్నారు. ఆ బియ్యం పిరిడి, గొల్లపల్లికి చెందిన వ్యాపారస్తులవిగా తెలుసుకున్నారు. శ్రీకాకుళానికి చెందిన రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సైలు ఎన్ అశోక్ చక్రవర్తి, బి.రామారావులు సిబ్బందితో కలిసి మాటువేసి పట్టుకున్న బియ్యాన్ని సీఎస్‌డీటీ జీవీ.భాస్కరావు సమక్షంలో తెర్లాం ఎంఎల్ఎస్ గిడ్డంగికి చేరవేశారు. నిందితులపై 6ఎ కేసులు నమోదుచేసి ఖాళీ వ్యాన్‌లను బాడంగి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. వ్యాన్ డ్రైవర్లలో కె.శంకర రావుది మెరముడిదాం కాగా ఆర్.అశోక్, నాగరాజు, సూర్యారావులది పిరిడి గ్రామంగా వారు చెప్పారు. దాడిలో తహసీల్దార్ బాలమురళీకృష్ణ పాల్గొని విజిలెన్స్ అధికారులకు సహకరించారు.


బాడంగి: ఆకులకట్టవద్ద విజిలెన్స్ అధికారులకు పట్టుబడిన బియ్యం వ్యాన్లు, డ్రైవర్లు

మరో 1100 కేజీల బియ్యం..

రాజాం సిటీ: మండల పరిధి రామానుజులపేట గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్సై బి.రామారావు, ఎ.అశోక్‌చక్రవర్తి, సీఎస్‌డీటీ చిరంజీవిరావులకు అందిన సమాచారం మేరకు సోమవారం గ్రామాన్ని సందర్శించారు. బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన ఇంటిపై దాడి చేసి 1100 కేజీలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మున్సిపాల్టీ పరిధి సారధి గ్రామానికి చెందిన కందుల శ్రీనివాసరావుపై 6 ఎ కేసు నమోదుచేశారు.


రాజాం: పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ దీపిక ఎం

రేగిడి: జిల్లాలో గంజాయి అక్రమ రవాణాతోపాటు వినియోగదారులపై ఉక్కుపాదం మోపుతున్నామని ఎస్పీ దీపిక ఎం అన్నారు. యువత గంజాయి వినియోగానికి బానిసలవుతుండడంతో దీనిని సవాల్‌గా తీసుకున్నామన్నారు. సోమవారం మండల పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీకి వచ్చిన ఆమె ఈ మేరకు విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఇంతవరకు 19 చోట్ల గంజాయి పట్టుబడగా 46 మందిపై కేసులు నమోదు చేశామని వెల్లడించారు. దీనిపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి పంటలు, ఇళ్లలో ప్రత్యేకంగా గంజాయిని పండించినా అక్రమ రవాణాపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పనిచేస్తుందని తెలిపారు.

చిట్టీల మోసం పట్ల అప్రమత్తం

చిట్టీల పేరుతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, కొంత మంది ఏజెంట్లు చిట్టీల కంపెనీల్లో పనిచేస్తున్నారని, వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిట్టీలు నడిపేవారు, ఏజెంట్లుగా పని చేసిన వారు ఇద్దరూ నేరస్తులవుతారని హెచ్చరించారు. జిల్లాలో కుల దూషణ కేసులు తగ్గాయని, వరకట్న వేధింపులు, భార్యాభర్తల మధ్య తగాదాలు పెరిగాయని, సచివాలయాల పరిధిలో మహిళా పోలీసులు ఇటువంటి వాటిని ముందే గుర్తించి తగిన కౌన్సిలింగ్ ఇస్తూ పోలీసు ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో చలివేంద్రం, షటిల్ కోర్టును ప్రారంభించడంతోపాటు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, కేసుల పరిష్కారం, సిబ్బంది పనితీరుపై ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెతో పాటు రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు, ఎస్సై ఇ. శ్రీనివాసరావు, సంతకవిటి ఎస్సై జనార్దనరావు, సిబ్బంది పాల్గొన్నారు.


రేగిడి పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ దీపికా ఎం. పాటిల్

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ

- ఎస్‌బీఐ ఆర్ఎం సీవీ సుబ్రహ్మణ్యం


రాలీని ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం సీవీసుబ్రహ్మణ్యం

విజయనగరం అర్బన్: అత్యధిక వడ్డీ ప్రయోజనం కల్పించే ఫిక్స్‌డ్ డిపాజిట్లను అందుబాటులో తీసుకువచ్చామని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ సీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎస్‌బీఐలో అత్యధిక వడ్డీ ప్రయోజనాలిచ్చే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అవగాహన కల్పిస్తూ సోమవారం నగరంలో ర్యాలీ చేపట్టారు. ఎస్‌బీఐ ఆర్ఎం కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బ్యాంకింగ్ రంగంలో వినియోగదారులకు అధికవడ్డీ ప్రయోజనం కలిగించే పలు పథకాలను ఎస్‌బీఐ అందిస్తోందన్నారు. అందులో అమృతకలశ్, సర్వోత్తం డిపాజిట్ల ముఖ్యమైనవన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఎంపీఎస్టీ అధికారి బండారు సూర్యారావు, ఎస్‌బీఐ కంటోన్మెంట్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ జయంతి శ్రీనివాసరావు, పట్టణంలోని వివిధ బ్రాంచ్‌ల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ: ముగ్గురికి తీవ్ర గాయాలు


పార్వతీపురం: చికిత్స పొందుతున్న క్షతగాత్రులు


జామి: ప్రమాదంలో గాయాల పాలైన యువకులు

పార్వతీపురం: గుమ్మలక్ష్మీపురం మండలం కేదారిపురం గ్రామం వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం మండల తోట గ్రామానికి చెందిన మండంగి చంటి, నిమ్మక జోగేష్, బి.గోపాల్‌లు ఒడిశాలోని గుణుపూర్‌వద్ద జరిగే జాతరను చూసేందుకు ఆదివారం రాత్రి వెళ్లారు. తిరిగి అర్ధరాత్రి 2 గంటల సమయంలో బయలుదేరి ద్విచక్రవాహనంపై వస్తుండగా కేదారిపురం దాటిన తరువాత వెనుకనుంచి వచ్చిన ఆటో ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ముగ్గురు తుప్పల్లోకి జారిపడి తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తును నిర్వహిస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి..

జామి: మండలకేంద్రం జామి మాధవరాయి మెట్టసమీంలో రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్ర గాయాల పాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. సోంపురం గ్రామానికి చెందిన జి.బాలాజీ గ్రామం నుంచి జామి వైపు బైక్‌పై వస్తుండగా బానాది గ్రామానికి చెందిన పి.కార్తీక్ జామినుంచి ఎస్.కోట వైపు బైక్‌పై వెళ్తున్న సమయంలో మాధవరాయిమెట్ట కాలనీవద్ద ఇద్దరి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో కింద పడి తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో విజయగనరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.